సింహాచలానికి అన్నం పెట్టేసి, నిద్రపుచ్చింది.

ఎదురు చూస్తూ గుమ్మంలో కూచుంది. నవంబరు నెల రొజ్జగాలి. పైటతీసి వంటి నిండా కప్పుకుంది.

ఈసారి అమ్మని డబ్బులడిగి అన్నం వండుకోవడానికి శేరుబియ్యం వుడికేలాగ స్టీలు గిన్నె కొనుక్కోవాలి. నీళ్ళు కాచుకోవడానికి కుండ వుంది. ఆ కుండ తీసేసి రాగిబిందె కొనుక్కోవాలి. ఒక్కటంటే ఒక్కటే స్టీలు కంచెం, రెండు స్టీలు గ్లాసులూ వున్నాయి. పెళ్లినాటివి. కనీసం మరొక స్టీలు కంచమూ, రెండు స్టీలు గ్లాసులూ కొనుక్కోవాలి. సిల్వరు చెంబూ, కంచు గ్లాసులూ వున్నాయి. ఒక స్టీలు చెంబుకూడా కొనుక్కుంటే బాగుణ్ణు. నూకరత్నం కలల్లోకి వెళిపోయింది.

మొదటాట వదిలేసినట్టున్నారు.

బాగా ఆకలిగా వుంది. ఇంకా రాలేదు పైడిరాజు. పులుసు తలుచుకుంటే నోరూరి పోతున్నాది. కాని మనసు కట్టుకుంది. వస్తే ఇద్దరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ తినొచ్చు.

సినీమా హాలు దగ్గిర పాటలు ఆగిపోయాయి. రెండో ఆటకి బెల్లు కూడా మోగింది. అప్పుడొచ్చాడు పైడిరాజు. చేతిలో పకోడి పొట్లం వుంది. మంచి వుషారుగా వున్నాడు. సమ్మె అయిపోయిందట. రేపణ్ణించీ పనుల్లోకి వెళ్తారట.

కార్మికులందరిలోనూ వున్న వైరుధ్యాలే పైడిరాజులోను వున్నాయి. పరస్పర విరుద్ధమైన ఆలోచనలూ, అలవాట్లూ వున్నాయి. ఇవ్వాళ కొవ్వాడ మిల్లు యజమానిని పట్టుకుని కడిగేసినవాడు పైడిరాజే. అత్యాచారానికి గెరయిన ఆడకూలీకి రెండు వేలు యివ్వడానికి కొవ్వాడ మిల్లు యజమాని అంగీకరించక తప్పలేదు. కార్మికుల జీతాలు నెలకు ముప్ఫయిరూపాయల వరకూ పెరిగాయి. ఆడకూలీలకు పదిహేను రూపాయలు పెరిగాయి. ఇవన్నీ అన్నం తింటూ చెప్పాడు.

"ఇయ్యాల పులుసు శానా బాగుందే నూకాలూ. అమురృం నాగుంది " అని లొట్టలు వేస్తూ అన్నం తిన్నాడు.

"కొత్త తపేలాలో పెట్నాను పులుసు" అన్నది నూకాలు సంతోషంగా."పులుసు రుసి కొత్త తపేలాలో లోదే. నీ సేతి ఒంటలో వుంది" అన్నాడు పైడిరాజు మూడోసారి పులుసు కలుపుకుని.

"సేపలు తెచ్చినందుకు మహలక్ష్మప్పకి అర్ధ రూపాయియ్యాల. నేనిచ్చిన డబ్బులు సాలకపోతే అప్పుపెట్టింది" అన్నది నూకరత్నం.

"జీతాలు పెరిగినాయే పిచ్చి మొఖమా, ఇలాంటి సిల్లరప్పులొక లెక్కేటి? అన్నట్టు కొత్త జీతాలొచ్చాక నీకో పాతిక రూపాయలిస్తాను ఏమేమి గిన్నెలూ, తపేలాలూ కావాలో కొనేసుకో" అన్నాడు పైడిరాజు చాలా ఉదారంగా.

"పాతిక రూపాయల కేటొస్తాయి.? ఒక యాభయిరూపాలియ్యి" అన్నది నూకరత్నం, ఖాళీ అయిపోయిన పులుసు తపేలా పక్కకి పెడుతూ.

*రచన : 22-4-92,*
*ప్రచురణ : 1) ఆంధ్రజ్యోతి వార పత్రిక, 21-8-1992.*
*2) వాగావళికథలు (1995)*